# భిక్షువు

మొక్కపాటి నరసింహశాస్త్రి గారు (సాహితీసమితి)

'మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు సహోదరాః, అర్థం నాస్తి గృహం నాస్తి...'

## ౧

ఆది పుష్యమాసము. ఉదయము ఆరుగంటలు అయినది. చలి చాలా ఎక్కువగా ఉన్నది. మంచు కూడా ఈ సంవత్సరము మామూలుకంటె చాలా ఎక్కువగా ఉండి సన్నని వర్షపు తుంపురులవలె పడుతూ ఉన్నది. కన్నూ కన్నూ కనుపడడము లేదు. బెజవాడ వెళ్లవలె ననే ఉద్దేశ్యముతో రైలుకోరకు గోదావరి స్టేషనుకు తెల్లవారుఝామునే వచ్చి కూర్చున్నాను. ఎంతమాత్రమూ ఎవ్వరికీ అవసరము లేదు గనుక గోదావరి మీదనుంచి గాలి రంయ్యినివీస్తూ గజగజలాడిస్తూ ఉన్నది. మంచు దోమతెరవలె అన్నివైపులనూ కప్పివేయడముచేత ఎదురనున్న రైలుపట్టాలుకూడా కనుపడడము లేదు. స్టేషనుబయిట బళ్ల చప్పుడు, మనుష్యుల మాటలూ మట్టుకు వినపడుతూ ఉన్నాయి.

'మాతా నాస్తి పితా నాస్తి నాస్తిబంధు సహోదరాః, అర్థం నాస్తి గృహం నాస్తి......' అనే శ్లోకము నాచెవిని పడ్డది. మాతృశబ్దమునకు సర్వవిధములా ఉదాహరణగా నున్న మాఅమ్మకూడా స్వర్గస్థురాలై అప్పటికి నెలరోజులుమాత్రమే అయినది. అప్పటి నాఅవస్థ తెలుచుకుంటే సరిగా ఆశ్లోకములో చెప్పినట్టే ఉన్నది. ఆమాటలు నాచెవిని పడీపడడములో అప్రయత్నముగా నాకళ్ల వెంబడి నీళ్లు వచ్చినాయి.

ఎవరు చెపుమా ఈప్రశాంతప్రభాతవేళ ఈ వేదాంతోపదేశముతో కలగిఉన్న నా హృదయాన్ని మరింత కల్లోలపెట్టినవారు అనుకున్నాను. మాటలు చెవిని పడడమే కాని మంచులో మనిషి కనుపడలేదు. నావలె రైలుకు వచ్చిన బాటసారి అయిఉంటాడా? పాపము అతనూ ఏమికష్టములో ఉన్నాడో అనుకుంటూఉండగానే నాసందేహము నివారణ అయినది.

'కామక్రోధంచ లోభంచ మోహంచ మదమత్సరాః'.

'తలితండ్రులారా, కడుపుకాలిపోతోంది. నాలుగురోజులయింది అన్నము కళ్లచూచి. ధర్మము చెయ్యండి పుణ్యాత్ములారా! ఈనిరుపేదను రక్షించండి' అనే ఆర్తనాదము నాచెవులపడ్డది. వెంటనే మనిషికూడా కనుపడ్డాడు. తొంభయిఏళ్ల తొక్కులా ఉన్నాడు. గోచీ పెట్టుకున్నాడు. ఇంకొక చిరుగులగుడ్డ కప్పుకున్నాడు. చేతులో ఒక వెదురుకర్ర ఉన్నది. దృష్టి బాగా మందగించినట్లు తెలుస్తున్నది. తలా గడ్డమూ మీసమూ నెరసి ముగ్గుబుట్టలా ఉన్నవి.

ముందుచొక్కాలు తొడుక్కొని పైన శాలువ కప్పుకున్న నాకే చలి భరించడానికి శక్యము కాకుండా ఉంటే ఇంక పాప మాభిక్షువుసంగతి వేరే చెప్పడ మెందుకు.

ఆ ఆర్తనాదము విని ఆమనిషిని చూచేటప్పటికి నాకు పట్టరాని దుఃఖము వచ్చినది. నాకు ఎప్పుడు ఏమష్టివానిని చూచినా చాలా జాలిగా ఉంటుంది. వాడికివ్వడానికి దగ్గర ఏమీ లేకపోతే ఏడుపు వస్తుంది. అదృష్టవశాత్తూ కాస్త ఉన్నఇంట్లో పుట్టడముచేత కాని లేకపోతే, ఆ అవస్థలో ఉండవలసినవాళ్లమే కదా అనో, లేక ఏక్షణములోనో ఉన్నది కాస్తా ఊడ్చిపెట్టుకుపోతే ఇలాగే బయలుదేరవలసివస్తుంది

కదా అనే భీతో, లేక, అందరికీ ఒక్క మోస్తరు అవకాశములుఉండి జీవయాత్రలో అంతా ఒక్కచోటనే బయలుదేరుతే ఆబిచ్చగాడే ఒకప్పుడు మనకంటె ఎక్కువగా ఉండవచ్చుననే అనుమానమో: ఏకారణమో తెలియదుకాని భిక్షువును చూచినప్పుడు మట్టుకు చేతనైన సాహాయ్యము చెయ్యకుండా వెళ్లలేను. ఏకారణమేనా కావచ్చునుకాని చవుకగా పుణ్యము సంపాదిద్దామని, ఏ పావలా డబ్బులకో స్వర్గముకొందామనీ ఉద్దేశ్యము మట్టుకులేదు.

అందులో ప్రస్తుతము నేఉన్నస్థితిలో ఆభిక్షువు స్వరూపము చూచి వాడు అన్నమాటలు వినేటప్పటికి నాగుండె తరుక్కుపోయినది. వానిని పిలిచి, డబ్బుఇద్దామని చూచేటప్పటికి దగ్గర చిల్లరడబ్బులు లేకపోయినవి. ఒక్కఅణాకాసు ఉన్నది. పోనీఅని అదితీసి వాడి చేతిలో పెట్టినాను. వాడు అది కళ్లదగ్గరగాపెట్టి చూచుకుని 'బాబూ నాదగ్గర చిల్లర లేదండి. నాలుగురోజులనుంచి ఒక్కడబ్బు నాచేతులో పెట్టినవారు లేరండి' అన్నాడు వణుకుతూను. 'పరవాలేదులే. చిల్లర అక్కరలేదు. ఏమైనా కొనుక్కతిను' అన్నాను. వాడు మాట్లాడకుండా మళ్లీ ఆ అణాకాసుకేసి చూసి, వంగి నాముఖము ఒక్కమాటు పరీక్షగా చూశాడు. వాడి కళ్లలో నీళ్లు నిండినాయి. ఆ దుఃఖముచూడలేక, నేను నాముఖము ఒకపక్కకు తిప్పుకున్నాను. అంత ఆభిక్షువు నిటారుగ్గా నిలువబడి, కళ్లు తుడుచుకుని, ఒక్క నిట్టూర్పు విడిచి 'Thank you sir, may God bless you' అని ముందుకు సాగినాడు.

ఆమాట ఇంగ్లీషున అనడమూ, ఆభాష ఉచ్చారణా వినేటప్పటికి నాకు ఆశ్చర్యము కలిగినది. 'ఎవరీ భిక్షువు? చదువుకున్నవానివలె ఉన్నాడే! మొదట ఏవో రెండుశ్లోకములు చదువుతే ఊరికే భిక్షాటనచేయడమున కుపకరిస్తవని నేర్చుకున్నాడు కాబోలు ననుకున్నాను. కొంపతీసి బాగా చదువుకున్నవాడేమో. ఇలా ఉండడమునకు ఎంతెంతకష్టము లనుభవించి ఉండవలెనో, ఈస్థితికి ఎందుకు వచ్చినాడో' తెలుసుకుందామని బుద్ధిపుట్టినది. ఆపూటకు నాప్రయాణము ఆగిపోయినాసరే వానిసంగతి తెలుసుకోవలెనని నిశ్చయించుకున్నాను.

లేచి పదిఅడుగులలో అతన్ని కలుసుకున్నాను. అతన్ని పలుకరించి, 'రండి, కాఫీహోటలుకు నేను తీసుకువెడుతాను. నాకూ ఆకలిగాఉండి నేనూ వెడుతున్నాను' అన్నాను. భిక్షువు ఆగి, 'అయ్యా, నేను సామాన్య భిక్షువును; తమరు గొప్పవారు, చదువుకున్నవారు. నన్ను బహువచనములో సంబోధించవలసిన అవసరములేదు. నేను మీకంటె పెద్దవాడినే అనుకోండి వయసులో. అయినా ఆకారణముచేత రోడ్డుమీద కనపడే ప్రతియాచకుణ్ణీ మీబోంట్లు, గౌరవించ నక్కరలేదు' అన్నాడు.

'అవునులెండి; ఆమాట నిజమే. కాని ఏకారణముచేతనో మిమ్ములను చూస్తే, మీరు మామూలు బిచ్చగాండ్రుకారనీ, కొంత పెద్దబ్రతుకు బ్రతికి, కాలవశమున ఈ అవస్థ అనుభవిస్తున్నారనీ తోచి మిమ్ములను గౌరవించ బుద్ధిఅయినది. దానిలో తప్పుఏమున్నది! నడవండి వెడుదాము' అన్నాను.

'అయ్యా, తాము నాకోసము వస్తున్నట్లు తోస్తున్నది. ఇంతవరకూ తాముచేసిన ఉపకారమే ఎక్కువ. నేను భిక్షాటన మారంభించినప్పటినుంచి ఒక్కరుకూడా ఒక్కసారి అణా ఇచ్చినవారు లేరు. ఇచ్చిన స్వల్పమేనా విసుక్కోకుండా ఇచ్చినవాళ్లు బహుఅరుదు. అట్టిస్థితిలో తాము మాట్లాడకుండా నన్నుపిలిచి అణా ఇవ్వడమే కాకుండా ఇంకా నాకోసము మీరు శ్రమపడడము నాకు ఎంతమాత్రమూ ఇష్టములేదు' అన్నాడు.

'నేను మీకోసము రావడములేదులెండి. వచ్చినా తప్పులేదు. ఊరికే గోరంత కొండంతచేసి మీరు అలా స్తోత్రము చేస్తూఉంటే నాకు సిగ్గుగా ఉన్నది' అన్నాను.

'నాకోసము కాదంటే నేనెలా నమ్మను. ఇంత ఉదయాన్నే ఈచలిలో స్టేషనుకు ఊరికేవచ్చి కూర్చోరు గదా, ఎక్కడికేనా ప్రయాణముమీదనై ఉండవలెను కదా. రైలుకు టైముఅయినది. అదుగో గంటకూడా కొడుతున్నాడు. దయచేసి నాకు సెలవు ఇప్పించండి. పూర్వజన్మ సంచితము అనుభవిస్తున్నానుకదా! ఈయాచనలవల్ల ఉత్తర జన్మమునకు కొంతఋణము జాగ్రతపెట్టుకుంటున్నాను కదా! అవసరమైనకంటె నన్ను ఎక్కువఋణస్థుణ్ణిగా

చెయ్యకండి. బాబూ, నామనవి విని తమరు దయ చెయ్యండి.' అన్నాడు. నేను వల్లకాదని పట్టుపట్టి కాఫీహోటలుకు తీసుకువెళ్లినాను.

అక్కడికి వెళ్లినతరువాత లోపలికి రమ్మంటే రానన్నాడు. ఎన్నివిధముల చెప్పినా వినలేదు. అందుచేతను ఇద్దరమూ వీథిఅరుగుమీదనే కూర్చున్నాము. ఆయనకు కావలసినదంతా ఆయన అడుగకుండానే కనిపెట్టి వద్దనేవరకూ తెప్పించి ఇప్పించినాను. ఫలహారము అయ్యేవరకూ మేమేమీ మాట్లాడలేదు. ఒకటి రెండుసార్లు భిక్షువు కళ్లనుండి కన్నీటిచుక్కలు ఆయన ఆకులో పడటము చూచినాను.

ఫలహారముకాగానే లేచి, అయినసొమ్ము ఇచ్చివేసి, 'దయచెయ్యండి వెడదాము' అన్నాను.

'ఎక్కడికి, బాబూ? ఇకనైనా తమపని చూచుకోరా' అన్నాడు.

'వెళతాలెండి! దయచెయ్యండి' అన్నాను. మారుమాట లేకుండా నావెంట వచ్చాడు.

తిన్నగా గోదావరీతీరమునకు వెళ్లి అక్కడ మరల అరుగుమీద కూర్చున్నాము.

'అయ్యా! నాదొక్కకోరిక ఉన్నది. తమర్ని అడుగకూడనిసంగతి ఒకటి అడుగుతాను. అన్యథా భావించక, తమ జీవితచరిత్ర కొంత సెలవివ్వవలెను. నాకు వినవలెనని చాలా కుతూహలముగా ఉన్నది. తమకు కష్టముగా ఉంటేమట్టుకు తమరిని శ్రమపెట్టను' అన్నాను.

'అయ్యా, ఈరోజున తమరు నాకు చేసిన మహోపకారమునకు నాకృతజ్ఞత ఎట్లా చూపవలెనో తెలియకుండా ఉన్నది. ఈజన్మలో నే నెప్పుడూ మరవజాలనిదయను నాయెడల కనుపరచినారు. నా చరిత్ర చెప్పడానికి అభ్యంతరమేముంటుంది. కాని చెప్పవలసినంత విశేషమేమీ లేదు. ఉన్నదికాస్తా తమబోట్లువిని ఆనందించేదికాదు. అయినా తమకు వినవలెనని ఉంటే, చెపుతాను' అన్నాడు.

'ముఖ్యముగా వినవలెనని ఉన్నది. దయచేసి చెప్పండి' అన్నాను.

మంచు ఇంకా తెరిపి ఇవ్వలేదు. గోదావరిమీదను మరీ ఎక్కువగా ఉండి నీరుగాని నీటిపైని పడవలుగాని పక్కనున్న శైలువంతెన గాని కనుపించడము లేదు. దగ్గరనున్న మెట్లమీదనుంచి స్త్రీలు నీళ్లబిందెలు బుజాన ఎత్తుకునివస్తూ వెడుతూ ఉన్నట్లు, కాళ్ల అందెల చప్పుళ్లవల్లనే తెలుస్తున్నది. మరియు అరుగుమీద మాకు కొంచెము దూరములో నలుగురు బైరాగులు కూర్చుని 'జయ్ శంకర్ భగవాన్' అని మధ్యమధ్య గంజాయి పీలుస్తూ దగ్గుతూ కూర్చున్నారు. రోడ్డుమీద నొక ఒంటెద్దుబండి నెమ్మదిగా కునికిపాట్లుపడుతూ వెడుతున్నది. భిక్షువు 'అయితే వినండి చెపుతాను' అని తన కథ ప్రారంభించినాడు.

## ౨

## భిక్షువు కథ

ఏడెనిమిది సంవత్సరముల క్రితము నన్ను మీరు చూచిఉన్నట్లైతే ఇప్పుడు నన్ను గుర్తించలేకపోయేవారు. మీరన్నమాట ఏమిటి. నాభార్య నన్ను గుర్తించలేకపోయినది. మీరు ఆశ్చర్యపడవలసిన పనిలేదు. మీరనుకుంటున్నట్లు ఏడుసంవత్సరములకాలము మనిషిలో ఇంతమార్పును తీసుకురాలేదు. ఒకవేళను అది సాధ్యమైనా ఇంతవిచారమూ? అవస్థా ఉండకపోయేవి. అట్టిమార్పు క్రమేణా వచ్చేది. వస్తున్నదని మనకు తెలిసేది. మనము అందుకు సిద్ధపడి ఉండేవాళ్లము. కాని ఒక్కరోజులో ఇంతమార్పు వస్తుందని కలలోనైనా కథలోనైనా నమ్మగలరా? కాని జరిగినదంతే. ఒకపువ్వు వాడిపోవడమునకైనా దాని అల్పాయుర్దాయములో కొంచెము ఇంచుమించుగా నాలుగవవంతుకాలము పడుతుందే. ఒకమనిషి పిడుగులాటివాడు ఇలా మారడానికి ఎంతకాలము పట్టవలెనో ఆలోచించండి. ఎంత ప్రబల వ్యాధి ఉన్నా ఒక్కరోజులో ఇంతమార్పు పొందగలడా? Oh! God! తలచుకుంటే గుండె బద్దలైపోతుంది. క్షమించండి. మొదలు చెప్పకుండా తుదకు వస్తున్నాను. నాసంగతి తలచుకుంటే ఆవేశము పట్టలేను.

నే నిప్పుడు మనవిచేసినట్లుగా ఏడెనిమిది సంవత్సరముల క్రితము నేను వేరుగా ఉండేవాడిని. ఇప్పటివలె

ఎండిపోయిన ఒరుగులా ఉండేవాడిని కాను. నిండు యౌవనములో ఉండేవాడిని. వేడిరక్తము పొంగి పొరలుతూ వరదరోజులలో గోదావరివలె నా రక్తనాళములలో ప్రవహిస్తూ ఉండేది. చిన్నప్పటి నుంచీ వ్యాయామక్రీడలయందు ఆసక్తిగా ఉండి కృషి చేయడముచేత నాశరీరము కండలుదేరి పాశ్చాత్య శిల్పి చెక్కిన శిలావిగ్రహమువలె చూడ ముచ్చటగా ఉండేది. నాశరీరమును చూచుకుంటే నాకే ఎంతో సంతోషముగా ఉండేది. అందుచేతను దాని నెంతో జాగ్రతగా కాపాడుకుంటూ ఉండేవాడిని. ఈ అంగసౌష్ఠవమునకు తోడు నా ముఖముకూడా చక్కగా ఉండేదని అందరూ అనుకునేవాళ్లు. అసలు ఎక్కువ అందము లేకపోయినా, మనిషి పిడుగులా ఉండి నిండుయౌవనములో ఉంటే సామాన్యుడైనా అందముగానే కనుపడుతాడు. దానికి తోడు కొంచెము చక్కదనము ఉంటే ఇంక చెప్పనే అక్కరలేదు. అందుచేత ప్రతివాళ్లూ నాకేసి చూస్తూ, నన్ను స్తోత్రముచేస్తూ, నాసహవాసము నపేక్షిస్తూ ఉండేవాళ్లు.

నా తలితండ్రులకు నేనొక్కడనే పుట్టినాను. అందుచేత నెంతో గారాబముగా పెరిగినాను. ఆటలయందూ పాటలయందూ ఉన్నశ్రద్ధ నాకు చదువులో ఉండేదికాదు. స్కూలుపాఠములంటే అసలే చదువబుద్ధి అయ్యేదికాదు. తరుచు ఏనవలలో ఏప్రబంధములో చదువుతూ ఉండేవాడిని. ఏమిచదివినా ఏమిచదవకపోయినా నెమ్మదిగా స్కూలుఫైనలు ప్యాసయి ఇంటర్మీడియేటులో ప్రవేశించినాను. రెండోసంవత్సరములో చదువుతూ ఉండగా నాకు వివాహము జరిగినది. నావివాహమైన కొద్దిమాసములకే మాతండ్రిగారు హఠాత్తుగా కాలము చేసినారు. సంసారము నెత్తిని పడ్డది. సంసారమంటే పెద్ద బాదరబందీ ఏమీలేదు. ఏదో కొద్దిగా ఉన్నవాళ్లముకాని అంత బొత్తుగా లేనివాళ్లముకాము. అయినా నాకుమట్టుకు చదువబుద్ధి అయినదికాదు. అందుకని చదువుమాని కొన్నాళ్లు ఇంటిదగ్గర ఊరికే కూర్చుని కాలయాపనచేసినాను. ఆలా ఊరికే కూర్చోవడము నాకే బాగాలేకపోయినది. అందుచేతను ఉద్యోగప్రయత్నము చేసినాను. అధికారిఅన్న అడ్డమైనవాళ్లచుట్టూ తిరిగితిరిగి ప్రాణమువిసిగి ఆప్రయత్నము మానుకొన్నాను.

ఇలాకొన్నాళ్లు గడచినతరువాత పోలీసు ఇనస్పెక్టరీకి ప్రయత్నము చెయ్యవలెనని బుద్ధిపుట్టినది. ఆప్రయత్నము చెయ్యగానే, వెనుకటివలెగాక, నాప్రయత్నము సఫలమైనది. సెలెక్షను దొరకినది.

నలుగురితోపాటూ ట్రయినింగుఅయి ఉద్యోగములో ప్రవేశించినాను. చాలాన్యాయముగా ఉండవలెననీ, కష్టపడి పనిచేయ్యవలెననీ, వృత్తిగౌరవము కాపాడవలెననీ మహదాశయములతో ఉద్యోగము ప్రారంభించినాను. కొలదికాలములో చాలామంచివాడిననీ, న్యాయస్థుడననీ, చురుకైనవాడిననీ పేరుపొందినాను.

ఉద్యోగములో ప్రవేశించిన కొద్దిరోజులకే నా భార్య కాపురమునకు వచ్చినది. ఆవిడకూడా చాలా చక్కని మనిషి. మే మిద్దరమూ చిలుకా గోరువంకలవలె ఉండేవాళ్లము. చుట్టుపక్కలవాళ్లు మా అనుకూలదాంపత్యము చూచి ఎంతో సంతోషించేవాళ్లు. నా భార్యకు నాపైనున్నప్రేమ తలచుకుంటే నాకే ఆశ్చర్యముగానూ ఒకప్పుడు భయముగానూ ఉండేది. నాలుగు సంవత్సరములపాటు ఒక్కక్షణముకూడా నన్ను విడిచి ఉండలేదు. నేను దగ్గరలేకపోతే పుట్టింటికికూడా వెళ్లేదికాదు. ఆనాలుగు సంవత్సరాలూ అద్వితీయమూ, మానవాతీతమూ అయిన సౌఖ్యమును అనుభవించినాము.

సంతోషము ఎప్పుడూ దుఃఖముతో మిళితము కాకుండా ఉండదు కాబోలు. ఒడలెరుగని సంతోషములో ఉండగా మాఅమ్మ నాలుగురోజులు జ్వరము వచ్చి స్వర్గస్థురాలైనది. నిశ్చలమైన మా ఆనందసరస్సులో ఒకపెద్దరాయి పడినది. అలలు బయలుదేరినవి. మా అమ్మపోయిన విచారములో ఉండి సెలవుతీసుకుని ఉండగా, శెలవు ముగియగానే మన్యమునకు మార్చినామనీ, ఒక్కసంవత్సరము అక్కడ పనిచేయవలసినదనీ ఆర్డరు వచ్చినది. దానితో మేమిద్దరమూ మరీ బెంగపెట్టుకున్నాము.

ఆమన్యప్రాంతములకు నా భార్యనుకూడా ఎట్లా తీసుకువెళ్లను. అది సాధ్యముకాదు. అందుకని ఆపెను

పుట్టింటు విడిచి వెళ్లవలెను. ఒక్కసంవత్సరము ఆమెను విడిచి ఉండడము ఎట్లాగు. నామాట ఎలాఉన్నా అందుకు నాభార్యే ఒప్పుకోలేదు. సుతరామూ పుట్టింటికి వెళ్లనన్నది. తనూ నాతో వస్తానన్నది. లేకపోతే నన్ను ఉద్యోగము మానుకోమన్నది. ఉద్యోగము మానుకోవడము ఎట్లాగు? పనియందు నాకు ఉత్సాహము కలిగినది. మంచిపేరుకూడా వచ్చినది. ఏదో ఒక ఏడాదిపాటు శ్రమపడితే. తిరిగి మన్యము విడిచి వచ్చేసరికి ప్రమోషనుకూడా అవుతుంది. ఇదంతా నాభార్యకు బోధపరచి చెప్పినాను. తుదకు ఏలాగైతేనేమి సమాధానపరచి పుట్టింట దిగపెట్టినాను. కాని మాకిద్దరకూ కూడా మనసులో ఒక చెప్పరాని భయమూ బెంగా బయులుదేరినది. ఈజన్మములో నింక ఇద్దరమూ కలుసుకోమేమో అనుకున్నాము. ఏదో గొప్పకష్టము రానున్నదనే భ్రాంతిమట్టుకు మాకు బాగా తోచింది. ఆబెంగతోటే ఒకరోజున బయులుదేరి నాఉద్యోగము ఊరు చేరుకున్నాను.

## 3

ఆఅరణ్యముల సౌందర్యము వర్ణించడానికి నాపాటివానికి శక్యముకాదు. ప్రస్తుతము అవసరమూ లేదు. కాని ఒక్కమాటమట్టుకు చెప్పక తప్పదు. అక్కడి ప్రకృతిసౌభాగ్యమును చూచి ముగ్ధుడనైపోయాను. ఆఆనందములో నాబెంగను కొంత మరచిపోయినాను. ఇటువంటిచోట నాకు ఏమి అపాయము వస్తుంది అనుకున్నాను. నాలో అణగిఉన్న సౌందర్యకాంక్ష, కవిత్వము, ప్రకృతి యందలి ప్రేమ, భావనాశక్తి, విశ్వప్రేమ, అన్నీ ఒక్కసారి బయటపడ్డవి. నన్నిక్కడకు మార్చినందుకు నా పైఅధికారులకు వందనము లర్పించాను.

నేను ఒక్కడినీ స్టేషనులోనే ఎప్పుడూ కాలక్షేపము చేస్తూఉండేవాడిని. మా స్టేషనుకు దగ్గరలోనే ఓవర్సీరుఆఫీసు ఉండేది. ఆ ఆఫీసుకు దగ్గరలోనే ఓవర్సీరు, దాక్షిణాత్యుడు, తనభార్యతో కాపురముండేవాడు. నే నక్కడకు వెళ్లిన కొద్దిరోజులలోనే మాకిద్దరికీ స్నేహము కలిసినది. తరుచు నేను వారింటికి వెళ్లడమో లేక ఆయన నాబసకు రావడమో జరుగుతూ ఉండేది.

ఇలాగు ఏబెంగా లేకుండా సుమారు ఎనిమిది మాసములు గడచినది. ఇంకను తిరుగ ఇంటికివెళ్లేరోజులు సమీపిస్తున్నవిగదా అని సంతోషిస్తూ ఉండేవాడిని. కొత్తగా వచ్చినప్పుడున్న బెంగ నిర్హేతుకము గదా అని నాలో నేనే నవ్వుకుంటూ ఉండేవాడిని.

నేను ప్రతిరోజూ రెండుపూటలా నాగ్రహము మీద షికారువెడుతూ ఉండేవాడిని. మామూలు ప్రకారము ఒకరోజు మధ్యాహ్నము మూడుగంటలకే బయులుదేరి షికారువెళ్లినాను. ఆరోజు మామూలుకంటె చాలా దూరము వెళ్లినాను. ఆ అడవికి అదివరకు నే నెప్పుడూ వెళ్లలేదు. నే నిదివరకు చూచిన అన్ని అడవులకంటె కూడా చాలా అందముగా ఉన్నది. గుర్రమును అక్కడ ఒకచెట్టుకు కట్టివేశి నే నొకరాతిమీద కూర్చుని ఆ సౌందర్యమును చూచి ఆనందిస్తున్నాను. అలాగే నాకు తెలియకుండానే సూర్యాస్తమయము కావచ్చినది. నేను కూర్చున్నచోటుకు దగ్గరగానే ఒక పెద్దచెరువు ఉన్నది. కొన్నిలేళ్లు వచ్చి నన్నుచూచి సందేహించి నేను నిశ్చలముగా కూర్చోడమువల్ల భయమువదలి నీళ్లుతాగి చక్కాపోయినాయి. చెట్లలో పక్షులుచేసే రొదతో చెవులు గింగురుమని పోతున్నాయి. కొంచెము దూరములో ఒక సెమళ్లగుంపు పరుగెత్తుకుపోతోంది.

సూర్యుడు అస్తమించబోతున్నాడు. చెరువుకు నీళ్ల అడుగున ఎర్రని డాకురేకు పరచినట్లుగా ఉన్నది. మధ్యమధ్య చెట్లనీడపడి చాలా చక్కగా ఉన్నది. ఆచెరువుకేశి తదేకదీక్షగా చూస్తూఉండగా దూరాన్ని ఒకపెద్దపులి నెమ్మదిగా ఒకచెట్టుచాటునుంచివచ్చి నీళ్లు తాగుతోంది. దాన్ని చంపుదామా అని పక్కనున్న తుపాకీపైకి చెయ్యి పోయింది. కాని ఆ సమయములో అంతఘోరకృత్యము చెయ్యబుద్ధి అయిందికాదు. చెయ్యి తుపాకిమీదనుంచి తీసివేశాను. పెద్దపులి, దాన్నిదారిని అది పోయింది. నే నింక వెడదామని లేవబోతున్నాను. నా వెనుకనుంచి కిలకిల నవ్వు వినపడ్డది. లేచి వెనక్కు తిరిగి చూచాను. నావెనుక ఒకచెట్టును విలాసముగా చేర్లపడి సుమారు పధ్ధెనిమిది సంవత్సరముల

బోయకన్య ఒకతె అజంతా చిత్తరువులా నవ్వుతూ నిలబడ్డది. నాకు ఆశ్చర్యము వేసింది.

సుమారు అయిదడుగులున్నర ఎత్తు, మెరుగుచామనచాయ శరీరము, దట్టముగా తుమ్మెదరెక్కలవలె నల్లగా ఉన్న శిరోజములు, సోగలై, విశాలములైన కన్నులు, తీరిచినట్లు కనుబొమలు, కోటేరేశినట్లు ముక్కు, ముద్దులు మూటకట్టే నోరు, తాళఫలప్రతిమానములైన స్తనములు, చూచి నిశ్చేష్టుడనై పోయాను. ఏమి అనడానికీ తోచలేదు. పోదామంటే కాళ్లు అక్కడనే పాతుకుపోయినట్లు కదలలేదు. దృష్టి ఆమె ముఖముమీదనుంచి మరల్చుకుందామంటేకూడా నాకు సాధ్యము కాలేదు. ఒక చిన్న ముతకగుడ్డ మొలకు చుట్టపెట్టుకుంది. అంతకంటె ఒంటిమీద మరొకబట్ట ఏమీ లేదు. నాకక్కడ నుంచోడానికి చాలా సిగ్గువేసింది. కాని కదలిపోలేకపోయాను. నేననేకమంది బోయకన్నెలను చూచాను. వాళ్లలో ఎవ్వరినీ మళ్లీ కన్నెత్తి చూడ బుద్ధిపుట్టలేదు. బొమ్మలలోనూ జీవితములోనూ అనేకమంది చక్కని స్త్రీలను చూచినాను. ఈమె ముందువాళ్లంతా చంద్రుని ముందు నక్షత్రములవలె కనపడుతున్నారు. నాకు నలుపన్నా చామనచాయఅన్నా ఆట్టే ఇష్టముండేదికాదు. చామనచాయ చాలా చక్కనిరంగు అంటే నేను ఎప్పుడూ వప్పుకునేవాడినికాను. కాని ఈపిల్ల శరీరములో ఉన్న ముఖమల్ లోని మెత్తతనము, పట్టులోని మెరుపూ చూచి నా అభిప్రాయము తప్పని తెలుసుకున్నాను. ఈ పిల్ల నా మనసును కలతపెట్టినట్లు ఎంత చక్కని స్త్రీ కూడా ఇదివర కెప్పుడూ నన్ను కలతపెట్టలేదు. ఆపిల్లకేశి అలాగే పదినిమిషములు రెప్పవాల్చకుండా, అదురుతున్న గుండెతో, చెదిరినమనసుతో, చూస్తూ నిలబడ్డాను. ఆ అమ్మాయికూడా మందహాసము నాట్యమాడుతున్న కళ్లతో, చలిస్తున్న అధరముతో నాకేశి చూస్తూ ఒయ్యారముగా నిలబడ్డది. అంబరవీథిని విహరిస్తున్న నామనస్సును లాగిపట్టి మాట్లాడకుండా గిరుకున తిరిగి గుర్రమెక్కి పరుగున నాబస చేరుకున్నాను. నేను గుర్రమెక్కగానే ఫక్కున నవ్వింది ఆపిల్ల.

## ౪

ఆపూట నామనస్సు మనస్సులోలేదు ఏపని చేద్దామన్నా ఏమీ తోచేదికాదు. ఆపిల్లనవ్వు నాచెవులలో మారుమ్రోగుతూ ఉండేది. ఆమె ముఖము నాకళ్లముందు నాట్యమాడుతూ ఉండేది. ఆపూట అన్నము సయించలేదు. ఆరాత్రి నిదురపట్టలేదు. స్వచ్ఛమైన నామానసాకాశమున నల్లని చిరుమబ్బులు బయలుదేరినాయి. ఈవ్యూరు రాబోయేముందు బయలుదేరిన టెంగ ఒక్కసారి మనసులో తళుక్కుమని మెరిసినది.

మరునాడు ఉదయాన్నే లేచి మామూలు ప్రకారము షికారు బయలుదేరినాను. అనుకోకుండానే తిన్నగా, నిన్నవెళ్లినచోటికే వెళ్లినాను. నాకోసము కనిపెట్టుకుని ఉన్నట్టుగా ఆబోయపిల్ల అక్కడనే అలాగే నవ్వుతూ నిలబడ్డది. ఆపిల్లనక్కడ చూడడముతోనే ఒకవిధమైన సంతోషమూ భయమూకూడా కలిగినాయి.

గుర్రము నొకచెట్టుకు కట్టివేశి ఒకరాతిమీద కూర్చున్నాను. ఆపిల్లె మొదట నన్ను పలుకరించినది. 'ఏమండి దొరా, నిన్నను పారిపోయినారేమి? నన్ను చూస్తే భయమువేసినదా? పోలీసువారుకూడాను అట్లా భయపడ్డారేమి? అందులో ఆడపిల్లను చూచి' అన్నది.

నాకు కొంచెము సిగ్గువేసి తలవంచుకున్నాను. ముఖము ఎర్రపడ్డది. 'నిన్ను చూసి నేను భయపడడమేమిటి' అన్నాను.

'లేకపోతే ఎందుకలా పారిపోయారు నిన్నను' అన్నది.

'నేను పారిపోలేదు. చీకటిపడుతున్నది కదా అని వెళ్లిపోయినాను' అన్నాను.

'అలాగా? అయితే పరవాలేదు అన్నమాట. నేను దగ్గరకు రావచ్చునా' అని నాసమాధానము వినకుండానే వచ్చి నాపాదములదగ్గర కూర్చున్నది. ఒక్క అరగంటసేపు ఏమీ మాట్లాడకుండా నాముఖముకేశి తదేకదీక్షగా చూస్తూ కూర్చున్నది. నేనూ ఆపిల్ల ముఖము మీదనే దృష్టినిలిపినాను. నామనస్సు ఎక్కడెక్కడికో పోయినది. ఏవేవో ఆలోచనలు బయలుదేరినాయి.

'ఇంత కాలము ఊరుకున్నారేమి, ఇక్కడకు రాకుండాను' అన్నది ఆఖరికి ఆపిల్ల. నేను ఉలిక్కిపడ్డాను. గగనసంచారము చేస్తున్న నా ఊహలను వెనక్కు మళ్లించి, 'ఇంతకాలము ఏమిటి, ఎంతకాలము' అన్నాను.

'ఎరుగరా! మీరిక్కడకు వచ్చి ఏడెనిమిది మాసములైనదే. అప్పటినుంచీ నేను మీకోసము ఎదురుచూస్తున్నాను. ఒక్క సంవత్సరమునుంచి నాహృదయములో చెప్పశక్యముగాని ఆందోళన బయలుదేరినది. దానికి ఏవిధమైన శాంతిచేదామన్నా సాధ్యమైనదికాదు. నాకెప్పుడూ నిద్రపట్టేదికాదు. తిండి తినబుద్ధి అయేదికాదు. ఎక్కడినుంచో ఏదోపిలుపు వినపడుతూ ఉండేది. దేనికోసమో నిరంతరమూ వెతుకుతూ ఉండేదాన్ని. ఎప్పుడూ ఈఅడవులలో ఈచెట్లమధ్య తిరుగుతూ ఉండేదాన్ని. మావాడే ఒకడు తన్ను పెళ్లిచేసికోమని చాలా తొందరపెట్టినాడు. నాకెంతమాత్రమూ ఇష్టము లేకపోయినది. మీరు వస్తారని నాకు తెలుసును. ఏడెనిమిదిమాసములనుంచి హృదయవేదన కొంచెము తగ్గినది. అప్పుడు మీరు సమీపములో ఉన్నారని తెలుసుకున్నాను. అప్పటినుంచి ఇంకా రారేమని కనిపెట్టుకుని ఉన్నాను. ఆఖరికి నిన్న మిమ్ములను చూడగానే పట్టరానిసంతోషము వచ్చినది. మండువేసంగిలో మలమల మాడిపోయిన భూమిపైన తొలకరివర్షము పడితే ఉన్నట్లుగా ఉన్నది నామనసుకు అప్పుడు. ఇంతకాలమునుంచీ నేను ఎదురు చూస్తున్నది మీకోసమేనని తెలుసుకున్నాను. నేనిక్కడ కనిపెట్టుకున్నానని మీకెప్పుడూ తోచలేదూ? అయితే మీ నాగరికులు అటువంటి సూచనలు తెలుసుకోలేరేమో. మాఆటవికులసంగతి వేరు. ప్రతి గాలిలోనూ మా శోకవార్త ఉంటుంది. ప్రతిపక్షీ కిలకిలలోనూ మా శోకపాట వినిపిస్తుంది. ప్రకృతిలో ప్రతి ఒక్కధ్వనికీ మాహృదయము ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. మీలో అలా కాదేమో!' అని ఊరుకున్నది.

నేను ఏమిచెప్పడమునకూ తోచినదికాదు. అమాయకురాలైన ఆపిల్లమాటలు విని, జ్యోతులవలె ప్రకాశిస్తున్న ఆమెకన్నులు చూస్తూ, ప్రేమపూరితము, అగాధము అయిన ఆమెహృదయమును తలచుకుంటే నాకే భయము వేసినది. ఏమీ అనలేకపోయినాను. అనిర్వచనీయమైన కరుణారసము బయలుదేరి నన్ను ముంచెత్తినది. నాచెయ్యి ఆమెవైపుకు జాపినాను. ఆమె నాకరగ్రహణముచేసి, నాదగ్గరగా జరిగి నా కాళ్లపైన తనతల ఆనించి, కన్నీటితో నాపాదములను తడిపింది.

అలాగే కదలకుండా సూర్యుడు నెత్తిపైకి వచ్చేవరకూ నోరులేనిపశువులవలె కూర్చున్నాము. నన్నుగురించి ఆమె ఏమీ అడుగలేదు. నేనేమీ చెప్పలేదు. లేచి 'నేను వెడతాను' అన్నాను. 'సరేను' అన్నది. మళ్లీ ఎప్పుడు వస్తావని అడుగలేదు. ఎవరిదారిని వారు వెళ్లినాము.

ఆసాయంకాలము మళ్లీ అక్కడనే కలుసుకున్నాము. మా ఉభయులమైత్రీ ఎట్లు అభివృద్ధి పొందినదీ ఇప్పుడు నేను చెప్పలేను. అదంతా తలుచుకుంటే నాకు చాలాబాధగా ఉన్నది. అందుచేత నన్ను క్షమించండి. కాని ఒక్కసంగతి: ఆ అమ్మాయి ఆరోజులలో అన్నమాటలూ, చేసినచేష్టలూ, చూచినచూపులూ జన్మజన్మాంతరములకూ మరుపురావు. అహర్నిశాదులు దుస్స్వప్నములవలె ఎప్పుడూ నాకళ్లకు కట్టినట్లుండి యమబాధ పెడుతున్నాయి. అన్నివిధములా నరకము అనుభవిస్తున్నాను.

కొన్నిరోజు లలా సుఖస్వప్నమువలె గడచిపోయినాయి. ఒకరోజు రాత్రి భోజనముచేసి పండువెన్నెలలో కుర్చీవేసుకుని కూర్చున్నాను. ఊహాప్రపంచములో సంచరిస్తూ పరధ్యానముగా కూర్చున్నాను. సుమారు రెండు ఝాములరాత్రి అవుతుంది. ప్రపంచమంతా నిశ్శబ్దముగా ఉన్నది. దూరాన్ని ఎక్కడో పులి అరుపు వినపడ్డది. ఎక్కడనో ఒకకీచురాయి శబ్దముచేస్తూ ఉన్నది. నాకు కొంచెము దూరములో నానౌకరు గుర్రుపట్టి నిద్రపోతున్నాడు. హఠాత్తుగా నావెనుకనుంచి ఎవరో వచ్చి నాకళ్లు మూశారు. ఉలిక్కిపడి చేతులుపట్టిచూచి బోయపిల్ల అని తెలుసుకున్నాను. నెమ్మదిగా నవ్వుతూ నాకుర్చీచేతిమీద కూర్చున్నది. ప్రతిరోజూ తను అక్కడనే నిద్రపోతున్నాను అని చెప్పింది.

* * * * *

తెల్లవారకముందు లేచి వెళ్లిపోయింది.

౫

ఇలాగు మూడుమాసములు గడచినవి. నాకు ఇక్కడ ఉద్యోగము ఆఖరు కావస్తున్నది. ఇంకొక నెల దినములలో ఇంటికి పోవచ్చునుకదా అనుకున్నాను. ఈపిల్లతోటి, ఎలా చెప్పడము ఎలావదలించుకోడ, మనుకుంటూ ఆలోచిస్తూ, ఒకరోజు రాత్రి మావసారాలో పచారు చేస్తున్నాను. బయట గాఢాంధకారముగా ఉన్నది. అప్పటికి సుమారు పదకొండుగంట లవుతుంది. నా వెనుక మెల్లగా వస్తున్న అడుగులచప్పుడు వినపడ్డది! నేను వెనక్కు తిరిగి చూచేటప్పటి కప్పుడే ఆవ్యక్తి నా దగ్గరకు వచ్చినది.

పరీక్షగా చూచేసరికి ఆమె నా స్నేహితుడైన ఓవర్సీరుభార్య. ఆరోజున ఆయన ఊళ్లో లేడని నాకు తెలుసును. ఎందుకు వచ్చినదా అనుకున్నాను. ఉత్తర క్షణమందే నా సందేహము తీరినది. 'ఏమి, అలా చూస్తారు? ఇట్లా వచ్చినానని నాపైన కోపమా' అంటూ నెమ్మదిగా దగ్గరకు చేరింది.

నేను ఆవూరు వచ్చినప్పటినుంచీ ఆమె నాయెడల చూపిన ఆదరమువల్లా, భర్తచాటునుంచో లేక నేను ఒంటరిగా కనుపించినప్పుడో ఆమె చూపిన హావభావ విలాసాదులవల్లా ఆమె నన్ను వేరుచూపుతో చూస్తున్నదని తెలుసుకున్నాను. నాకు చిన్నప్పటినుంచీ ఇటువంటి అనుభవములు చాలా అయినవంటే మీరు అతిశయోక్తి అనుకుంటారేమోనని సందేహిస్తున్నాను. కాని ఈ ఒక్క బోయకన్య విషయములోతప్ప నే నెక్కడా ఎవ్వరికీ లొంగలేదంటే మీరు నమ్మవలెను. అటువంటి అప్పుడు ఈమె—నా స్నేహితుని భార్య—ఇలా సాహసించడముతోనే నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఆమె ననేకవిధాల మందలించి పంపవలెనని ప్రయత్నము చేసినాను. నేను వద్దన్న కొద్దీ ఆమెదగ్గరకు వచ్చి నన్ను ఆలింగనము చేసుకోబోయినది.

ఆసమయములో వికటమైన ఒక పెద్దనవ్వు మాకు వినపడ్డది. దానితో ఆమె హడలిపోయి మళ్లీతిరిగిచూడకుండా వాళ్లబసకు పోయింది. ఆనవ్వు ఎక్కడనుంచి వచ్చినదో నాకు తెలుసును. నేను నిశ్చలముగా నిలబడ్డాను. నిప్పులు కక్కుతున్న కళ్లతో పొంచిఉన్న పులి నెమ్మదిగా ఎరదగ్గరకు వచ్చినట్లు ఆబోయపిల్ల నాదగ్గరకు వచ్చి 'ఎవరామనిషి' అన్నది. ఎవరైతే నీకెందుకు అన్నాను.

'నాకు కాకపోతే ఇంకెవరికి? ఎందుకు ఆవిడను కౌగిలించుకున్నావు' అంది.

'నేను కౌగిలించుకోలేదు. ఇంతకీ, నేను కౌగిలించుకుంటేమట్టుకు నువ్వెవరు అడగడానికి? నీకేమైనా బొందికట్టినానా' అన్నానే కోపముగాను.

దానితో కొంచెముతగ్గి 'నువ్వా ఇలాటివాడవేనా? నీవు వేరనుకున్నాను. నేనిది సహించలేను' అన్నది. 'మరి అయితే నేను వెళ్లినతరువాత ఏమిచేస్తావు' అన్నాను.

ఘొల్లున లేచి, 'ఏమిటి? వెళ్లిపోతావా? నన్ను విడిచిపెట్టి వెళ్లిపోతావా? నాగతేమిటి? నువ్వు మామూలుమనిషివి కావనుకున్నాను. అందరిలాటివాడవే నీవూను. దొరకనవరకూ పుచ్చుకోడమూ, ప్రతిఫలము కోరినప్పుడు మాట్లాడకపోవడమూను చెరకును రసమున్నంతవరకు పీల్చి పిప్పిచేయడమూను, పారవేసి పోవడమూను. నన్నింత మోసము చేస్తావనుకోలేదు.' అని విలపించడము ప్రారంభించింది.

నాకు బాగా కోపము వచ్చింది. 'ఏమిటి ఈ అల్లరంతాను? వెళ్లిపోక ఇక్కడ నీకు పాదసేవ చేస్తూ కూర్చుంటా ననుకున్నావా ఏమిటి? నాకేమీ ఇల్లూ వాకిలీ, పెళ్లామూ లేదనుకున్నావా' అన్నాను.

'ఏమిటేఁ నీకు భార్యకూడా ఉన్నదా? అయితే వెళ్లడము నిశ్చయమే. అయ్యో, నాతోటి మొదటనే ఎందుకు చెప్పలేదు. నీచక్కనిముఖము చూచి నీ హృదయముకూడా అంత శుభ్రమైన దనుకున్నాను' అని ఇంకా ఏమేమో నన్ను నిందిస్తూ నాపాదముల దగ్గరపడి చాలాసేపు ఏడిచింది.

నేనేమిచేయును? నాకు మనస్సులో చాలా కష్టముగానే ఉన్నది. నేను ఆపిల్లను మోసముచేయవలెననుకోలేదు. కాని నాసంగతి చెప్పవలసినదే మొదట.

అది నాతప్పే. అప్పుడు నేను నేనుగా లేను. నాకు ఏమీ స్వతంత్రము లేకపోయింది. మహాప్రవాహములో కొట్టుకుపోతున్న నావలాగ అశక్తుడనై ఊరుకున్నాను. శ్రుతిమించిన తరువాత, తప్పుకోడ మెలాగనే అహర్నిశాదులు ఆలోచిస్తున్నాను.

ఇప్పుడీపిల్లను ఎలా ఊరుకోపెట్టడానికీ తోచలేదు. మాట్లాడకుండా అలాగే నిలబడ్డాను. కొంతసేపు ఏడ్చిఏడ్చి, తుదకు లేచి నారెండుచేతులూ పట్టుకుని, 'అయితే నిజంగా వెడతావా' అంది. ఆమెముఖము చూస్తే నాకూ కళ్లమ్మట నీళ్లువచ్చినాయి. 'వెళ్లక ఏమి చెయ్యను. ఇంతకూ ఇంకొకనెలరోజులు పోయినపిమ్మట కదా' అన్నాను.

కన్నుల నిప్పులు కురుస్తూ ఉరుముఉరిమినట్లు 'అవును పాపము, ఇంకొకనెల ఇక్కడ ఉండాలి కాబోలు. తరువాత సుఖముగా భార్యకౌగిట్లో స్వర్గము అనుభవించవచ్చును. నేనేమైతే నీకేమి. ఎక్కడినుంచో మా అడవులలోకి వచ్చావు. మా ఉద్యానవనాలలో దొరకని దివ్యకుసుమము ఒకటి కనుపడితే అది కోసుకున్నావు. కాస్సేపు ఆసౌరభము అనుభవించావు. ఇంకా అది నలగనేనా నలగకుండా, వాడనేనా వాడకుండా నేలమీద గిరవాటేసి పోతున్నావు. నీకేమి, ఇంకొక పువ్వు దొరుకుతుంది. నలిగిపోయేది వాడిపోయేదీ పువ్వుకాని నీవుకాదుకా. నువ్వెప్పుడూ మందహాసము చేస్తూ ఏమీ ఎరగనట్లు వాయువులాగ నీ ఇష్టము వచ్చినచోట సంచరించవచ్చును' అని గర్భనిర్భేదముగా ఒకనవ్వు నవ్వింది.

ఒక్కక్షణము ఊరుకుని, 'నువ్వు పాపము సుఖపడదామని సంతోషిస్తున్నావేమో. నీకింక సుఖమన్నమాట లేకుండా చేస్తాను. నాకెలాగూ లేదు. నీవుమట్టుకెందుకు సుఖపడాలి? నిన్నిక్కడనుంచి సుఖంగా వెళ్లనివ్వను. నాకు నువ్వు దక్కకపోయినాసరే కాని ఇతరుల కౌగిట్లో నిన్ను చూచి సహించలేను. ఆ ఆలోచన కూడా సహించ శక్యము కాదు. మాసంగతి నీకు తెలియదు. మేమెంత ప్రేమించగలమో అంతకంతా అసహ్యించుకోగలము. అమృతము పుట్టినచోటనే విషము కూడా పుట్టింది. ఇంతగా నన్ను ప్రేమించిన మనిషి నాకపకారము చేస్తుందా అనుకుంటావేమో. అటువంటిభ్రమలు పెట్టుకోకు' అని ఒక్కపరుగున చక్కాపోయింది.

నాకు ఎక్కడలేని భయమూ వేసింది. కాళ్లు వణకడ మారంభించినవి. అక్కడనే చదికిలపడి, తెల్లవారువరకూ పొడిగుడ్లతో కూర్చున్నాను.

## ౬

ఇంక నాకథ ఆఖరు కావస్తున్నది, క్షమించండి, ఇంతసేపు మిమ్ములను కూర్చోపెట్టినందుకు, ఉదయాన్నే బయలుదేరి ఆపిల్లను కలుసుకుని కొంచెము సముదాయిద్దామని మామూలుచోటికి వెళ్లినాను. అక్కడ కనపడలేదు. తిన్నగా ఇంటికి వచ్చి భోజనముచేసి పడుకున్నాను. సాయంకాలముకూడా ఆపిల్ల కనపడలేదు. 'ఏమి భగవంతుడా, ఇదేమి చేస్తుందా' అనుభీతితో మళ్లీ భోజనంచేసి పడుకున్నాను. తెల్లవారుసరికి ఉపద్రవమైన తలనొప్పితో లేచాను. కళ్లు తెరిచేసరికి నా శరీరము నాకే అసహ్యముగా కనుపించింది. అద్దము దగ్గరకువెళ్లి చూసుకున్నాను. మీ కిప్పుడు కనుపడుస్థితిలో నాశరీరము నాకు కనుపించింది. ఆకాశము విరిగి నెత్తిని పడ్డట్టయినది. స్పృహతప్పి పడిపోయినాను. కొంతసేపటికి తెలివి వచ్చింది. కర్ణకఠోరమైననవ్వు దూరాన వినపడ్డది. ఆమనిషిని చంపుదామని తుపాకితీసుకుని పరుగెత్తాను. ఎక్కడా దొరకలేదు. ఇంక చెయ్యవలసినదేమున్నది? ఒక్కవిషపుగాలి వచ్చి ఫలోన్ముఖమైన చెట్టును మాడ్చేశింది.

తక్షణం ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి రెండవకంట పడకుండా మాఅత్తవారింటికి చేరుకున్నాను. ఎవ్వరూ నన్ను ఆనవాలు పట్టలేక పోయారు. మా మామగారితో జరిగినదంతా చెప్పాను. నిశ్చేష్టుడై విన్నాడు. చాలాసేపు విచారించాడు. నాఆస్తి నా భార్యపేర వ్రాయించాడు. నన్ను ఎక్కడికేనా వెళ్లి మందు పుచ్చుకోమన్నాడు.

'నే నీస్థితిలో ఎక్కడికి వెడతాను? మా అమ్మ కూడా లేదాయెను. ఇక్కడనే ఉండి మందు పుచ్చుకుంటా' నన్నాను.

'పిల్లలున్న ఇల్లు; ఇక్కడెలా వీలవుతుంది. నీ శరీరము వరుసచూస్తే కుష్ఠువ్యాధిలా ఉన్నది. ఇక్కడ అట్టే వీలుగా ఉండద'న్నాడు.

'అయితే నా భార్యను పంపండి. మేము వేరే ఉంటాము' అన్నాను.

'అమాయకుడులా ఉన్నావు. అదిమట్టుకు ఒక్క స్త్రీ ఉండి నీకు ఏమిసంరక్షణ చెయ్యగలదు. ఇది ఘోరమైన అంటువ్యాధి అన్నసంగతి నీకుమట్టుకు తెలియదా. దాన్ని ఎందుకు బాధపెడతావు. పైగా ఈ అల్లరంతా నలుగురినోళ్లా పడడము ఎందుకు. ఎక్కడికో వెళ్లి చడీచప్పుడూ కాకుండా మందుపుచ్చుకోరా' అన్నాడు.

నా భార్యను పిలిచి 'నీఅభిప్రాయమేమి' టన్నాను. మాట్లాడకుండా ఏడుస్తూ నిలబడ్డది. కొంతసేపటికి 'ఏ రామచంద్రపురం ఆసుపత్రిలోనో మందు పుచ్చుకుంటే వీలుపడదా' అంది.

నేనింక మారుమాటాడకుండా వచ్చాను. ఒకరిద్దరు వైద్యుల నడుగుతే ఇదేవ్యాధో అసలు తెలుసుకోలేక పోయారు. పైకి ఇలాఉన్నా లోపల మామూలుగా బలముగానే ఉన్నది. చేసేది ఏమీలేక ఇంటికి తిరిగీ వెళ్లడము ఇష్టము లేక భిక్షాటన ఆరంభించాను. ఈ ఒక్క-పొట్టకు తిండిదొరకడమే కష్టముగా ఉన్నది. ఏమిచెయ్యను? నే చేసుకున్న పాపము. జన్మాంతర సంబంధమై ఉండవలెను. ఎంతెంతమందో ఎన్నో ఘోరకృత్యములుచేసి సుఖంగా ఉంటారే. నాఖర్మముమట్టుకు ఇలా ఎందుకు కాలవలెను!"

౭

చాలాసేపు ఆభిక్షువు అలా విచారిస్తూ కూర్చున్నాడు. నాకూ జాలివేసి నేనూ కాస్సేపు విచారించాను. 'అయ్యా, విచారించకండి. నిప్పుతో చెలగాటాలాడేటప్పుడు ఒక్కొక్కప్పుడు ఒళ్లుకాలడము సహజమేను. కాని మీరు అధైర్యపడకండి. ఇటువంటి భయంకరమైన వనస్పతులు ఉన్నవని విన్నాను. మీరు చెప్పినది దానికి దృష్టాంతరమ్ముగా ఉన్నది. దీనికి విరుగుడుకూడా ఉన్నదని వైద్యులు చెపుతారు. ఎంతత్వరలో వచ్చినదో అంతత్వరలోనూ మళ్లీ నివారణ అవుతుంది. కాబట్టి మీరు మళ్లీ ఒక్కసారి మన్యము వెళ్లి ఏకోయవాళ్ల నేనా ఆశ్రయిస్తే లాభిస్తుం'దని సలహా ఇచ్చాను.

ఆమాటలు విని బ్రహ్మానందభరితుడై నాకు నమస్కారముచేసి, నేనిచ్చిన రూపాయి తీసుకుని వ్యాధి అప్పుడే కుదిరినట్లుగానే సంతోషించి వెళ్లిపోయాడు.

మంచుతెర తొలగిపోయింది. సూర్యుడు చక్కగా ఉదయించాడు. రైలుస్టేషనుదగ్గర మళ్లీ రైలుకు గంటకొట్టారు. ఈరైలేనా తప్పకూడదని నెమ్మదిగా స్టేషనుకు వెళ్లాను.

